సాక్షి
మహబూబాబాద్
సోమవారం । 19 । ఫిబ్రవరి । 2024

బంగారం(బెల్లం) మొక్కుతో మేడారం తల్లుల గద్దెల ప్రాంగణానికి చేరిన భక్తులు





అమ్మవార్ల గద్దెల వద్ద భక్తజన సందోహం

భక్తులతో పోటెత్తిన 'వనం'

ములుగు జిల్లాలో మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతర ప్రారంభానికి ముందే భక్తులు పోటెత్తుతున్నారు. ఈనెల 21 నుంచి జాతర మొదలవనుండగా.. ఆదివారం తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి సుమారు రెండు లక్షల మంది వనదేవతలను దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు. భక్తుల రద్దీ నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ప్రైవేట్ వాహనాలను పార్కింగ్ స్థలాల్లోకి మళ్లించడంతో చాలా మంది కాలినడకన గద్దెల వరకు ఇబ్బందులు పడుతూ చేరుకున్నారు. అధికారులు.. వీఐపీల పేరుతో వచ్చిన వాహనాలను గద్దెల సమీపంలోకి అనుమతిస్తూ.. భక్తుల వాహనాలను పార్కింగ్ ప్రదేశాల్లోకి మళ్లించడంతో విమర్శలు వెల్లువెత్తాయి.

– ఎస్‌ఎస్‌తాడ్వాయి



– వివరాలు 8లో ▸

సమ్మక్క గద్దె వద్ద భక్తుల సెల్ఫీ



గంట కొడుతున్న చిన్నారి

న్యూస్‌రీల్

కోర్టులో హాజరుపర్చాలి



నెహ్రూసెంటర్: బయ్యారం అటవీ ప్రాంతంలో పోలీసులు అదుపులోకి తీసుకున్న సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ దళ సభ్యుడు కొండన్నను వెంటనే కోర్టులో హాజరుపర్చాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు గుజ్జు దేవేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అదుపులోకి తీసుకున్న కొండన్నను వెంటనే కోర్టులో హాజరుపర్చాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రశాంత జీవనానికి విఘాతం కలిగించొద్దని, బయ్యారం అటవీ ప్రాంతంలో కూంబింగ్‌లను వెంటనే నిలిపివేయాలని అన్నారు. సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇడంపాక శ్రీశైలం, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు ఎస్‌కె తాజ్‌పాషా, పీవైఎల్ జిల్లా కార్యదర్శి భట్టు చైతన్య, జి.విజయ్ పాల్గొన్నారు.

ఎస్సైల బదిలీ

మహబూబాబాద్ రూరల్: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న 11మంది ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. గడ్డం ఉమా వీఆర్ టు సీసీఎస్, ఎండి.మౌలానా డీఎస్బీ టు బయ్యారం సెకండ్ ఎస్సై, ఎల్.శ్రీనివాసరావు బయ్యారం సెకండ్ ఎస్సై టు మరిపెడ సెకండ్ ఎస్సై, సీహెచ్.అరుణ డీఎస్బీ టు మానుకోట టౌన్ సెకండ్ ఎస్సై, డి.పవన్ కుమార్ వీఆర్ మహబూబాబాద్ టు వరంగల్ కమిషనరేట్, పి.రాజు పెద్దవంగర టు వీఆర్ మహబూబాబాద్, జి.సంతోష్ చిన్నగూడూరు టు వీఆర్ మహబూబాబాద్, సీహెచ్.రమేష్‌బాబు దంతాలపల్లి టు వీఆర్ మహబూబాబాద్, కె.అశోక్ కుమార్ వరంగల్ కమిషనరేట్ పరిధి హసన్‌పర్తి టు తొర్రూరు, ఎల్.రాంజీనాయక్ తొర్రూరు టు వీఆర్ మహబూబాబాద్, బి.రవికుమార్ ఐటీ కోర్ నుంచి గంగారం ఎస్సైగా బదిలీ అయ్యారు.


కాళోజీ రచనలు చైతన్యం కలిగించాయి

ఆచార్య బన్న అయిలయ్య



హన్మకొండ కల్చరల్: ప్రజాకవి కాళోజీ చేసిన రచనలు చైతన్యం కలిగించాయి.. సామాజిక వికాసం, విద్య ఆవశ్యకత, విద్యతో మానవుల అభివృద్ధి గురించి వివరించాయని కేయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బన్న అయిలయ్య అన్నారు. అంతర్జాతీయ స్థానిక భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని డార్కస్ సంస్థ ఆధ్వర్యంలో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ సహకారంలో ఆదివారం హనుమకొండ సుబేదారిలోని కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన తెలుగు భాష ఔన్నత్యంపై ప్రజాకవి పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు తెలుగు సాహిత్య సదస్సులో ఆయన మాట్లాడారు. ఇంతకు ముందు భారతదేశంలో తెలుగు రెండో స్థానంలో ఉండేది.. ప్రస్తుతం నాలుగో స్థానానికి వచ్చింది.. భాషను మనమే చంపేయడం ఇందుకు కారణమన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల తెలుగు లెక్చరర్ కర్రె సదాశివ్, ఎకనామిక్స్ లెక్చరర్ డాక్టర్ ఎర్రబొజ్జు రమేష్, చైల్డ్ కమిటీ చైర్‌పర్సన్ అనిల్‌చందర్‌రావు, మండల పరశురాములు, డార్కస్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ యేలేటి సుధాకర్, కుమార్ సరిత, పాషా, చైతన్య పాల్గొన్నారు.

లక్నవరం సందర్శన నిలిపివేత



గోవిందరావుపేట: మేడారం జాతర సందర్భంగా భక్తుల రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా లక్నవరం సరస్సు సందర్శనను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిలిపివేసినట్లు ఎస్సై షేక్ మస్తాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మేడారం జాతర నేపథ్యంలో నేటి నుంచి 26వ తేదీ వరకు లక్నవరం సరస్సు సందర్శనను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. మేడారానికి వచ్చే భక్తులు సహకరించాలని కోరారు. అదే విధంగా మండల పరిధిలోని మచ్చాపూర్, చల్వాయి, గోవిందరావుపేట, పస్రా గ్రామస్తులు వారి పశువులను జాతీయ రహదారిపైకి వదులొద్దని తెలిపారు. ఒకవేళ వదిలితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అరచేతిలో జాతర సమాచారం



యాప్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క, తదితరులు



'మై మేడారం గైడ్' యాప్

అందుబాటులోకి 'మై మేడారం గైడ్' యాప్

- పోలీసు శాఖ, కలెక్టర్ ఆధ్వర్యంలో రూపకల్పన
- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ పనిచేస్తుంది
- జాతర కార్యక్రమాలూ ఉంటాయి

ఏటూరునాగారం: దేశ నలుమూలల నుంచి మేడారం మహాజాతరకు చేరుకునే భక్తులకు రహదారులు, పార్కింగ్ స్థలాలు, తల్లుల గద్దెల ప్రాంగణ సమాచారం క్షణంలో తెలిసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం.. పోలీసు శాఖ, కలెక్టర్ ఆధ్వర్యంలో 'మై మేడారం గైడ్' యాప్‌ను రూపొందించారు. ఈ యాప్‌ను మేడారంలో రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క ఆవిష్కరించారు. ఈ యాప్ ఇంటర్నెట్ సహాయంతో.. అలాగే ఇంటర్నెట్ లేకుండా ఆఫ్‌లైన్‌లోనూ పనిచేస్తుంది. స్మార్ట్‌ఫోన్ ప్లేస్టోర్‌లో 'మై మేడారం గైడ్' యాప్ అని టైప్ చేసి ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఎలాంటి సమాచారం ఎంటర్ చేయకుండానే ఇది జీపీఎస్ ద్వారా లొకేషన్ షేరింగ్‌తో పనిచేస్తుంది. తాగునీటి సౌకర్యం ఎంత దూరంలో ఉందనేది చూపెడుతుంది. వైద్యం, పార్కింగ్, మూత్రశాలలు, మరుగుదొడ్లు, స్నానఘట్టాలు, తప్పిపోయిన వారి సమాచార కేంద్రాలు, అగ్నిమాపక శాఖ సర్వీసుల సమాచారం ఈ యాప్ ద్వారా పొందవచ్చు. గతంలో రూపొందించిన యాప్‌కు భిన్నంగా 'మై మేడారం గైడ్' యాప్‌ను తయారు చేయడం గమనార్హం.

సమ్మక్క–సారలమ్మ చరిత్ర

జాతర ప్రారంభమయ్యే నాటి నుంచి ముగిసే వరకు ఏయే కార్యక్రమాలు జరుగుతాయనే వివరాలతో అందరికీ అర్థమయ్యే రీతిలో సమాచారాన్ని ఈ యాప్‌లో పొందుపరిచారు. 21న బుధవారం సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలకు రావడం, గురువారం సమ్మక్క చిలకలగుట్ట నుంచి గద్దెకు చేరడం, శుక్రవారం మొక్కులు, శనివారం తల్లుల వనప్రవేశం కార్యక్రమాలను ఇందులో చూసుకోవచ్చు. అంతేకాకుండా ఆన్‌లైన్‌లో సహాయం పొందేందుకు ప్రత్యేకించి ఐదుగురు వ్యక్తుల నంబర్లను ఇందులో పొందుపరిచారు. ఏదైనా సమస్య ఉంటే ఉన్నతాధికారులకు తెలిసేలా కలెక్టర్, సబ్‌కలెక్టర్, ప్రత్యేక అధికారుల ఈ మెయిల్ అడ్రస్‌లు సైతం ఉన్నాయి. సమస్యలుంటే ఫిర్యాదు చేసి సహాయం పొందవచ్చు. ఈ యాప్ భక్తులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది.

వేతన వెతలు!



అందని రెండు నెలల జీతాలు

- వైద్యారోగ్యశాఖ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల అవస్థలు
- నెలనెలా ఇవ్వాలని వేడుకోలు

నెహ్రూసెంటర్: వైద్యారోగ్య కుటుంబ సంక్షేమశాఖ పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ (ఎన్‌హెచ్‌ఎం) కార్మికులు వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలల జీతాలు వేయలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్‌హెచ్‌ఎం పరిధిలో రెండో ఏఎన్‌ఎంలు, హెల్త్ సెంటర్ సిబ్బంది, ఎస్‌ఎన్‌సీయూ సిబ్బంది, డైక్ సెంటర్, ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీల్లో 500మంది పని చేస్తున్నారు. వీరితో పాటు సుమారు 800మంది ఆశవర్కర్లు, శానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ సిబ్బందికి సక్రమంగా వేతనాలు అందడం లేదు. దీంతో అప్పులు చేయాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేతనాలు అందకపోవడంతో..

నెలనెలా వేతనాలు అందకపోవడంతో ఇంటి అద్దె, బ్యాంకు రుణాలు, ఈఎంఐలు, ఇతర చెల్లింపులకు ఇబ్బందులు పడుతున్నామని ఉద్యోగులు వాపోతున్నారు. ప్రతినెల 5వ తేదీ లోపు జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రెండునెలల వేతనాలు ఒకేదఫాలో వేయాలని వేడుకుంటున్నారు.

ఏజెన్సీల ఇష్టారాజ్యం..

వేతనాలు చెల్లించడంలో కొన్ని ఏజెన్సీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని సిబ్బంది వాపోతున్నారు. ప్రతినెల వేతనాలతో పాటు పీఎఫ్, ఈఎస్‌ఐలు చెల్లించడం లేదని ఆరోపిస్తున్నారు. కాగా ఏజెన్సీల ద్వారా కాకుండా ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని కోరుతున్నారు.

నెలనెలా చెల్లించాలి



వైద్యారోగ్యశాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నెల నెలా వేతనాలు చెల్లించాలి. ఏజెన్సీల ద్వారా కాకుండా ట్రెజరీ ద్వారా వేతనాలు అందించేలా చూడాలి. ఉద్యోగులకు రావాల్సిన ఈఎస్‌ఐ, పీఎఫ్ సక్రమంగా అందించేలా చర్యలు తీసుకోవాలి.

– నర్సయ్య, జిల్లా అధ్యక్షుడు, తెలంగాణ మెడికల్, హెల్త్ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్

సకాలంలో అందించాలి



కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న ఉద్యోగులకు సకాలంలో వేతనాలు అందించాలి. ఈఎస్‌ఐ, పీఎఫ్ నిబంధనల ప్రకారం చెల్లించేలా ఏజెన్సీలకు ఆదేశాలు ఇవ్వాలి. నిబంధనలు పాటించని ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలి.

– లింగ్యా, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

కౌన్సిలర్ల టూర్!

- వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో..
- 4న మానుకోట మున్సిపాలిటీలో అవిశ్వాస సమావేశం
- రంగంలోకి మాజీ ఎమ్మెల్యే



మహబూబాబాద్: మానుకోట మున్సిపల్ వైస్ చైర్మన్ మహ్మద్‌ఫరీద్‌పై అవిశ్వాస తీర్మానానికి పార్టీలకతీతంగా కౌన్సిలర్లు సిద్ధమయ్యారు. ఈమేరకు 29మంది బీఆర్‌ఎస్, కాంగ్రెస్, సీపీఎం కౌన్సిలర్ల సంతకాలతో కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌కు అవిశ్వాస తీర్మాన పత్రం అందజేసిన విషయం తెలిసిందే. మార్చి 4న ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కౌన్సిలర్లు టూర్ వెళ్లినట్లు సమాచారం.

టూర్‌లో 18మంది..

అవిశ్వాస సమావేశం జరగనుండడంతో 18 మంది కౌన్సిలర్లు హైదరాబాద్‌కు వెళ్లినట్లు సమాచారం. కాగా మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ చిట్యాల జనార్దన్, గద్దె నీరజ, యాళ్ల పుష్పలత, బాలునాయక్, సీపీఎం కౌన్సిలర్లు సూర్నపు సోమయ్య, పద్మతో పాటు ఇతర కౌన్సిలర్లు టూర్‌కు వెళ్లలేదు. సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, బి.నిరజారెడ్డి ధర్మన్న అవిశ్వాసానికి దూరంగా ఉన్నారు. కాగా వారి మద్దతు కోసం బీఆర్‌ఎస్ కౌన్సిలర్ మార్నేని వెంకన్న తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈమేరకు సీపీఐ కౌన్సిలర్లు తటస్థంగా ఉంటారా.. లేదా ఎవరికి మద్దతు ఇస్తారో మార్చి 4న తేలనుంది.

మాజీ ఎమ్మెల్యే ప్రయత్నాలు..

వచ్చే నెల 4న మధ్యాహ్నం 3గంటలకు అవిశ్వాస సమావేశం ఉంటుందని కలెక్టర్ ద్వారా కౌన్సిలర్లకు సమాచారం అందింది. అవిశ్వాసానికి 13 రోజుల వ్యవధి మాత్రమే ఉంది. మహబూబాబాద్ ఎంపీపీ భూక్య మానికపై అవిశ్వాసం కోసం పలువురు ఎంపీటీసీలు ఆర్డీఓ అలివేలుకు ఫిర్యాదు చేయగా ఈనెల 17న సమావేశ నిర్వహించగా అవిశ్వాసం వీగిపోయిన విషయం తెలిసిందే. దీనిని దృష్టిలో పెట్టుకుని కౌన్సిలర్ మార్నేని వెంకన్న ఆధ్వర్యంలో అవిశ్వాసం నెగ్గేందుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనిలో భాగంగానే కౌన్సిలర్లను హైదరాబాద్ క్యాంపునకు తరలించినట్లు ప్రచారం. ఇదిలా ఉండగా వైస్ చైర్మ న్ మహ్మద్ ఫరీద్‌పై అవిశ్వాసం వీగిపోయేందుకు మానుకోట మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

మానుకోట మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి

- పది వేల బస్తాలకుపైగా రాక
- ముందస్తు తీసుకొచ్చిన రైతులు
- మంగళవారం నుంచి సెలవులు



మార్కెట్‌కు రైతులు తీసుకువచ్చిన మిర్చి బస్తాలు



మార్కెట్ ప్రధాన ద్వారం వద్ద నిలిచిన మిర్చి బస్తాల వాహనాలు

మహబూబాబాద్ రూరల్: మానుకోట వ్యవసాయ మార్కెట్‌కు రైతులు ఆదివారం అధిక మొత్తంలో మిర్చి బస్తాలు తీసుకొచ్చారు. సోమవారం మార్కెట్‌లో క్రయ విక్రయాలు జరగనుండగా రైతులు ముందస్తుగానే మిర్చి బస్తాలను తరలించారు. దీంతో మార్కెట్ ఆవరణలోని పది షెడ్లు మిర్చి బస్తాలతో నిండిపోగా మార్కెట్ ప్రధాన ద్వారం, వెనుక గేటు వైపు కుడా మిర్చి బస్తాలను తీసుకువచ్చిన వాహనాలు బారులుదీరాయి. ఈక్రమంలో పోలీసులు అక్కడికి చేరుకునిరైతులకు సర్ది చెప్పి వాహనాలను మార్కెట్‌లోకి పంపించారు. మార్కెట్ సిబ్బంది షెడ్ల వారీగా రైతులకు టోకెన్లు జారీ చేయడం ప్రారంభించారు. సుమారు పది వేల బస్తాలకు పైగా మిర్చిని రైతులు మార్కెట్‌కు తీసుకురాగా సోమవారం కూడా అధిక మొత్తంలో బస్తాలు రానున్నాయి.

మంగళవారం నుంచి సెలవులు..

మార్కెట్‌కు ఇప్పటికే పది వేల బస్తాలకుపైగా మిర్చి రాగా మార్కెట్‌లోని షెడ్లన్నీ బస్తాలతో నిండిపోయాయని సెక్రటరీ షంషీర్ అన్నారు. ఇటీవల మార్కెట్‌కు ప్రతిరోజు సుమారు 20వేల బస్తాల వరకు మిర్చి వస్తుందని, మార్కెట్‌లో స్థలం సరిపోక ఇబ్బందులు తలెత్తుతున్నాయని, రైతులు కూడా అవస్థలు పడాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఈ మేరకు రోజుకు ఐదు వందల మేరకే రైతులకు టోకెన్లు ఇస్తామని తెలిపారు. మార్కెట్‌లో అధికంగా మిర్చి ఉండడంతో మంగళవారం సెలవు ప్రకటించామన్నారు. అలాగే బుధ, గురు, శుక్రవారాల్లో మేడారం జాతర సందర్భంగా, శని, ఆదివారాలు వారాంతపు సెలవులు ఉన్నందువల్ల మార్కెట్ యార్డు బందు ఉంటుందని తెలిపారు. రైతు సోదరులు ఈ విషయాన్ని గమనించి 26వ తేదీ (సోమవారం)న మార్కెట్‌కు సరుకులు తీసుకురావాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకరాచారి

తొర్రూరు: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కె.సుధాకరాచారి అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలో ఎస్‌టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సుధాకరాచారి మాట్లాడుతూ.. ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ల మధ్య వేతన వ్యత్యాసాన్ని తగ్గించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. కేజీబీవీ, ఎస్‌ఎస్‌ఏ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలన్నారు. ఆదాయ పన్ను పరిమితిని రూ.10లక్షలకు పెంచాలన్నారు. ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమాలను రద్దు చేసి ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.యాకూబ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్, నాయకులు గుంటుక యాకయ్య, శ్రీనివాస్, రమేష్, హరికృష్ణాచారి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్
- మేడారం జాతరకు ప్రత్యేక బస్సులు ప్రారంభం



ప్రత్యేక బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నెహ్రూసెంటర్: ఆర్టీసీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేడారం క్యాంపును ఆదివారం ఆయన ప్రారంభించారు. బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన టికెట్ క్యూలైన్లు, బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం రూ.110కోట్ల నిధులను కేటాయించిందన్నారు. గత బీఆర్‌ఎస్ పాలనలో ఆర్టీసీని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేశారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి మేడారం జాతర భక్తుల కోసం ప్రత్యేకంగా చొరవ చూపుతున్నారని, మంత్రి సీతక్క దగ్గరుండి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నారని తెలిపారు. మహబూబాబాద్ ఆర్టీసీ డిపోకు ప్రభుత్వం ప్రత్యేకంగా 150 బస్సులను కేటాయించిందని, జాతరకు వెళ్లే మహిళా భక్తులకు ఉచిత ప్రయాణం కల్పించిందని, భక్తులందరూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ శివప్రసాద్, ఆర్టీసీ అధికారులు వెంకన్న, పట్టాభి లక్ష్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

తొర్రూరు: మేడారం జాతరలో ఆర్టీసీ అందిస్తున్న సేవలను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని తొర్రూరు డీఎస్పీ వి. సురేష్ తెలిపారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి మేడారానికి ప్రత్యేక బస్సు సర్వీసులను డీఎం విశ్వనాథ్‌తో కలిసి డీఎస్పీ ప్రారంభించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. మేడారం జాతరకు వెళ్లే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపేందుకు ఆర్టీసీ సిద్ధమవడం ఆహ్వానించదగిందన్నారు. డీఎం విశ్వనాథ్ మాట్లాడుతూ.. తొర్రూరు డిపో నుంచి మేడారానికి 186 బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌టీఐ రజితారెడ్డి, సూపరింటెండెంట్ తిరుమల్‌రావు, సిబ్బంది మల్లికార్జున్, ఆర్‌ఎస్ కుమార్, జిలుకర యాదగిరి, ఆర్. సత్తయ్య, శ్రీనివాస్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హత్య కేసులో కుటుంబ సభ్యుల అరెస్టు



నిందితుల అరెస్టు చూపిస్తున్న సీఐ శ్రీనివాస్

దుగ్గొండి : మండలంలోని మైసంపల్లి గ్రామానికి చెందిన జేరిపోతుల రాజును ఆయన భార్య, కుటుంబ సభ్యులు శనివారం తెల్లవారుజామున హత్య చేశారు. ఈ కేసులో నిందితులైన మృతుడి భార్య లక్ష్మి, కుమారుడు సూర్య, అల్లుడు రాకేష్‌, కూతురు మాధవి, బంధువు తరుణ్‌ను అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాస్‌ తెలిపారు. మద్యానికి బానిసై వేధించడంతో రాజు భార్య లక్ష్మి, కూతురు, కుమారుడు, అల్లుడితో కలిసి కర్రలతో కొట్టి వైరుతో ఉరేసి హత్య చేశారన్నారు. ఈమేరకు మృతుడి పెద్ద కుమారుడు ప్రశాంత్‌ ఫిర్యాదు చేయగా విచారణ చేస్తున్నామన్నారు. రాజు అంత్యక్రియలు ముగిశాక ఆదివారం నిందితులను పట్టుకున్నామన్నారు. ఐదుగురు నిందితులను కోర్టులో హాజరు పర్చగా మెజిస్ట్రేట్‌ రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఎస్సై జక్కుల పరమేష్‌, పోలీసు సిబ్బంది ఉన్నారు.

నల్లబెల్లం స్వాధీనం



నల్లబెల్లం, డ్రైవర్‌ను చూపిస్తున్న ఎస్సై

డోర్నకల్‌ : డీసీఎంలో అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లాన్ని పట్టుకున్నట్లు ఎస్సై సంతోష్‌రావు తెలిపారు. పోలీస్‌ స్టేషన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బైపాస్‌ రోడ్డులోని ఎన్‌టీఆర్‌ విగ్రహం వద్ద సిబ్బందితో వాహనాల తనిఖీ చేస్తుండగా లింగాల నుంచి మహబూబాబాద్‌ వైపు వెళ్తున్న డీసీఎం వాహనాన్ని ఆపి తనిఖీ నిర్వహించారు. కాగా డీసీఎంలో 50 క్వింటాళ్ల నల్లబెల్లం, రెండు క్వింటాళ్ల పటికను గుర్తించినట్లు తెలిపారు. బెల్లం, పటిక, డీసీఎం వాహనాన్ని స్వాధీనపర్చుకుని వాహన డ్రైవర్‌ తమిళనాడు రాష్ట్రంలోని సేలం జిల్లా, మెట్టూరు తాలూకా, సురపల్లి గ్రామానికి చెందిన నల్లతంబి కందస్వామిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



జంపన్న వాగు వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



జంపన్న వాగు వద్ద ఏర్పాటు చేసిన దుకాణాల్లో కొనుగోలు చేస్తున్న భక్తులు

మేడారానికి పోటెత్తిన భక్తులు

వనదేవతలకు మొక్కుల చెల్లింపు | కోలాహలంగా గద్దెల ప్రాంగణం



తల్లులను దర్శించుకుంటున్న భక్తులు



- తల్లులను దర్శించుకున్న రెండు లక్షల మంది భక్తులు

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతర ప్రారంభానికి ఇంకా మూడు రోజుల సమయం మిలిగి ఉంది. ఇప్పటికే నెల రోజుల నుంచి భక్తులు వనదేవతల దర్శనానికి ముందస్తుగా వెళ్లివస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్‌, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి లక్షలాదిగా జనం మేడారానికి తరలివచ్చారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం అమ్మవార్ల గద్దెల వద్దకు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీతో అధికారులు అమ్మవార్ల గద్దెలకు తాళాలు వేశారు. దీంతో బయట నుంచి పసుపు, కుంకుమ, ఒడిబియ్యం, చీరసారె, ఎత్తు బంగారం, కానుకలు సమర్పించుకున్నారు. అనంతరం వనంలో విడిది చేసి వంటావార్పు చేసుకుని భోజనాలు చేశారు. సుమారు 2 లక్షల మంది భక్తులు వనదేవతలను దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు.

పోలీసుల బందోబస్తు..

మేడారంలో భక్తుల రద్దీ నేపథ్యంలో ట్రాఫిక్‌ జామ్‌ కాకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. హనుమకొండ నుంచి పస్రా, కాటారం నుంచి కాల్వపల్లి, ఏటూరునాగారం నుంచి తాడ్వాయి మీదుగా మేడారం మార్గంలో వచ్చిన భక్తుల వాహనాలను పోలీసులు పార్కింగ్‌ స్థలాల్లోకి మళ్లించారు. దీంతో చాలా మంది జంపన్నవాగు నుంచి కాలినడక ఎత్తు బంగారం, పిల్లపాపలతో గద్దెల వరకు కాలినడకన ఇబ్బందులు పడుతూ రావాల్సి వచ్చింది. అధికారులు.. వీఐపీల పేరుతో వచ్చిన వాహనాలను గద్దెల సమీపంలోకి అనుమతిస్తూ.. సాధారణ వాహనాలను పార్కింగ్‌ ప్రదేశాల్లోకి మళ్లించడంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. జంపన్నవాగు నుంచి గద్దెల వరకు, ఆర్టీసీ బస్టాండ్‌ నుంచి గద్దెల వరకు వెళ్లడానికి భక్తులు ఆటోలను ఆశ్రయించాల్సి వచ్చింది. రద్దీలో ఆటోలు పద్ధతి లేకుండా నడపడంతో ట్రాఫిక్‌ జామ్‌ ఏర్పడి భక్తులకు ఇబ్బంది కలిగింది.

తల్లుల దర్శన భాగ్యమేదీ?

మేడారం సమ్మక్క– సారలమ్మను దర్శించునేందుకు భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఆదివారం లక్షల సంఖ్యలో భక్తులు దేవతల దర్శనానికి తరలిరాగా రద్దీ నియంత్రణకు పోలీసులు క్యూలైన్‌ ద్వారా దేవాదాయశాఖ విరాళ కౌంటర్‌ పక్కన గేట్‌ ద్వారా లోపలికి పంపించారు. అయితే వీఐపీల పేరుతో వచ్చిన వారి కుటుంబాలను ప్రధాన ద్వారం నుంచి సమ్మక్క గద్దెపైకి పంపించారు. ఎమ్మెల్యే పై స్థాయి ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు ప్రోటోకాల్‌ దర్శనాలు చేయించాల్సి ఉంది. కానీ అధికారులు తమకు పరిచయం ఉన్న భక్తులు, వారి కుటుంబీకులను గద్దెపైకి అనుమతించారు. అదే సమయంలో సాధారణ భక్తులను అనుమతించలేదు. పైగా భక్తులు రాకుండా తాళం వేశారు. దీంతో వారు అధికారుల పని తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు డౌన్‌.. డౌన్‌ అంటూ నినాదాలు చేశారు.

చేతులెత్తేసిన దేవాదాయశాఖ..

మేడారంలో భక్తులకు ప్రశాంత దర్శనాలు కల్పించాల్సిన దేవాదాయాశాఖ సిబ్బంది పట్టింపు లేనట్లు వ్యవహరించడంతో భక్తులు అసహనానికి లోనయ్యారు. దర్శనాల బాధ్యతను ఇతర శాఖలకు అప్పగించిన దేవాదాయశాఖ అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరించడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు ఎవరిని సంప్రదించాలో భక్తులకు తెలియలేదు.

ఆర్టీసీ అధికారులతో భక్తుల వాగ్వాదం



అధికారులతో వాగ్వాదం చేస్తున్న భక్తులు

ఎస్‌ఎస్‌తాడ్వాయి: బస్సు చార్జీల పెంపు విషయంలో భక్తులు ఆర్టీసీ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఆదివారం మేడారానికి వచ్చిన భక్తులు తిరుగు ప్రయాణంలో మేడారం నుంచి హనుమకొండ వరకు ఒకరికి స్పెషల్‌ చార్జీ రూ. 250 చెల్లించాలని కండక్టర్‌ కోరారు. మొన్నటి వరకు మేడారం నుంచి హనుమకొండకు రూ. 160 చార్జీ ఉండగా ప్రస్తుతం ఏకంగా రూ. వంద పెంచడంపై భక్తులు టికెట్‌ తీసుకోకుండా తాడ్వాయి ఆర్టీసీ బస్టాండ్‌లో అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఈనెల 18వ తేదీ నుంచి జాతర స్పెషల్‌ బస్సుల నడపడంతో చార్జీల పెరిగాయని అధికారులు.. భక్తులకు నచ్చజెప్పారు. అయినా చార్జీలు భారీ ఎత్తున పెంచడంపై అధికారులను నిలదీశారు.

జాతర విజయవంతానికి కృషి చేయాలి

- రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్క



పగిడిద్దరాజు ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి సీతక్క

గంగారం : ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర, తెలంగాణ కుంభమేళాగా పిలువబడుతున్న మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్‌, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి మేడారం జాతర ప్రారంభంకానున్న నేపథ్యంలో వనదేవత సమ్మక్క భర్త పగిడిద్దరాజు ఆలయమైన మహబూబాబాద్‌ జిల్లా గంగారం మండలంలోని పూనుగొండ్ల గ్రామాన్ని మంత్రి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. మరుగుదొడ్లు, మంచి నీటి వసతి తదితర సదుపాయాల కల్పనకు త్వరగా ప్రతిపాదనలు చేస్తే పనులు మంజూరు చేస్తామన్నారు. పూనుగొండ్లకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా అధికారులు, సిబ్బంది చూసుకోవాలన్నారు. పగిడిద్దరాజు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మేడారం నుంచి తీసుకొచ్చిన పట్టువస్త్రాలను పూజారులకు అందించారు. పగిడిద్దరాజు ఆలయంలో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని కోరారు. పగిడిద్దరాజు మేడారం చేరడంతో జాతర ప్రారంభమవుతుందని, అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. అనంతరం మంత్రి సీతక్క, ఐటీడీఏపీఓ అంకిత్‌, తదితరులను ఆలయ కమిటీ ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో మేడారం ట్రస్ట్‌ బోర్డు చైర్మన్‌ అరెం లచ్చు పటేల్‌, ట్రైబల్‌ వెల్ఫేర్‌ డీఈ రాంరెడ్డి, మహబూబాబాద్‌ డీఎస్పీ తిరుపతిరావు, ట్రైబల్‌ వెల్ఫేర్‌ డీఈ ముంకిడి ఎర్రయ్య, సీఐ రాజు, ఎస్సై దిలీప్‌, టీపీసీసీ ఆర్గనైజింగ్‌ సెక్రటరీ చల్లా నారాయణరెడ్డి, కొత్తగూడ, గంగారం ఎంపీపీలు విజయ రూప్‌సింగ్‌, సువర్ణపాక సరోజన జగ్గారావు, మండల అధ్యక్షులు వజ్జ సారయ్య, జాడి వెంకటేశ్వర్లు, ఏఈ రవి, ఆర్‌డబ్ల్యూస్‌ ఏఈ నరేష్‌, పగిడిద్దరాజు పూజారులు పెనక రాజేశ్వర్‌, పురుషోత్తం, సురేందర్‌, కాంగ్రెస్‌ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సేవాభావంతో విధులు నిర్వర్తించాలి

- టీఎస్‌ ఆర్టీసీ ఎండీ వీసీ.సజ్జనార్‌



మాట్లాడుతున్న ఆర్టీసీ మేనేజింగ్‌ డైరెక్టర్‌ సజ్జనార్‌

హన్మకొండ: మేడారం శ్రీ సమ్మక్క–సారలమ్మ మహా జాతరలో సేవా భావంతో విధులు నిర్వర్తిస్తూ భక్తులకు నాణ్యమైన, మెరుగైన సేవలు అందించాలని టీఎస్‌ ఆర్టీసీ మేనేజింగ్‌ డైరెక్టర్‌ వి.సి. సజ్జనార్‌ సూచించారు. మేడారం జాతరలో విధులు నిర్వహించేందుకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వచ్చిన అధికారులతో ఆదివారం వరంగల్‌ ములుగు రోడ్డులోని ఆర్టీసీ జోనల్‌ స్టాఫ్‌ ట్రైనింగ్‌ కాలేజీలో ఏర్పాటు చేసిన జాతర సన్నద్ధ సమావేశంలో ఆయన మాట్లాడారు. అమ్మవార్లను దర్శించుకోవడానికే వచ్చే భక్తులకు రవాణా పరంగా అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. జాతరలో కేటాయించిన స్థానాల్లో ఉద్యోగులు, సిబ్బంది విధులు నిర్వహించేలా చూడాలని అధికారులకు సూచించారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా జాతరకు వెళ్లే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని, సిబ్బంది చాలెంజ్‌గా తీసుకుని పథకాన్ని విజయవంతంగా అమలు చేయాలన్నారు. జీరో ఫెయిల్యూర్స్‌తో పాటు యాక్సిడెంట్‌ ఫ్రీగా జాతర జరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, భక్తులతో మర్యాదపూర్వకంగా మెలగాలని చెప్పారు. మహా జాతరలో దాదాపు 15 వేల మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని, వారికి వసతి, భోజన సౌకర్యం విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని అధికారులను ఆదేశించారు. అనంతరం మేడారం జాతరలో విధులు నిర్వహించే టీఎస్‌ ఆర్టీసీ సిబ్బంది కోసం యూనియన్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా సహకారంతో రూపొందించిన టీ షర్ట్‌లను సజ్జనార్‌ ఆవిష్కరించారు. టీఎస్‌ ఆర్టీసీ సీఓఓ డాక్టర్‌ రవీందర్‌, జాయింట్‌ డైరెక్టర్‌ అపూర్వరావు, ఈడీలు మునిశేఖర్‌, కృష్ణకాంత్‌, వెంకటేశ్వర్లు, రఘునాథరావు, వరంగల్‌ ఆర్‌ఎం జాస్తి శ్రీలత, రాష్ట్రంలోని ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

కాలుష్య రహిత జాతరకు సహకరించాలి

- పీసీబీ వరంగల్‌ ఈఈ సునీత



హన్మకొండ చౌరస్తా: ప్రతి రెండేళ్లకు ఒకసారి జరిగే తెలంగాణ కుంభమేళా మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరను ప్లాస్టిక్‌ రహితంగా నిర్వహించుకుందామని కాలుష్య నియంత్రణ మండలి వరంగల్‌ ఈఈ సునీత అన్నారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు జరగనున్న జాతర ఉత్సవాల్లో ప్లాస్టిక్‌ను వినియోగించొద్దని భక్తులకు విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్‌ రహిత జాతరలో భాగంగా పర్యావరణ అనుకూల ప్రచారం కోసం ఆరువేల పోస్టర్లు , మూడు వందల క్లాత్‌ బ్యానర్లను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. మొబైల్‌ వ్యాన్‌ ద్వారా గ్రామాల్లో ప్లాస్టిక్‌ వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన మూడు వందల మంది వలంటీర్లు ప్రత్యేక యూనిఫాం ధరించి ప్రచారం చేస్తారని, జాతరలో క్లాత్‌బ్యాగుల పంపిణీ, ఐదు రోజుల పాటు స్థానిక సాంస్కృతిక బృందాలతో కళాజాత కార్యక్రమాలు, ఆలిండియా రేడియో ద్వారా జాతరకు రెండు రోజుల ముందు జింగిల్స్‌ ప్రసారం, ఐఅండ్‌పీఆర్‌ ద్వారా టీవీ స్క్రోలింగ్‌లు, నాన్‌వెజ్‌ దుకాణాల వద్ద మాంస వ్యర్థాలను నేరుగా రెండరింగ్‌ ప్లాంట్‌లకు పంపించేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. జాతరకు సింగిల్‌ యూజ్‌ ప్లాస్టిక్‌ను తీసుకురావొద్దని భక్తులను కోరారు.

నిజమైన ఉద్యమకారులకు గుర్తింపు

- రాష్ట్ర పంచాయతీరాజ్‌ శాఖ మంత్రి సీతక్క



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

కేయూ క్యాంపస్‌ : ఎంతో మంది ఉద్యమకారుల పోరాటాలు, త్యాగాల ఫలితంగానే తెలంగాణ ఆవిర్భవించిందని, గత ప్రభుత్వం ఉద్యమకారులను విస్మరించిందని, ప్రస్తుత ప్రభుత్వం ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చేలా ముందుకెళ్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్‌, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక ఆధ్వర్యంలో హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్‌సైన్స్‌కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన సభలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ సాధనలో ఎంతో మంది ఉద్యమకారులు తమ జీవితాలను త్యాగం చేశారని, వీరందరికీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గుర్తింపు ఇస్తుందన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల మేరకే ప్రజాపాలన కొనసాగిస్తామన్నారు. కేసులు నమోదైతేనే ఉద్యమకారులని భావించకుండా నిజమైన ఉద్యమకారుల గుర్తింపునకు కమిటీ నియమిస్తామన్నారు. ఉద్యమకారులకు ఇళ్లస్థలాలు, ఆరోగ్యకార్డులు తదితర సంక్షేమ పథకాలు వర్తించేలా కూడా కృషి చేస్తామన్నారు. ఉద్యమకారులకోసం గత ప్రభుత్వం జీఓ 80ని తీసుకొచ్చినా అమలుచేయలేదన్నారు. గత ప్రభుత్వం హైదరాబాద్‌లోని అమరవీరుల స్మృతీ వనంలోని ఓ ఫ్లోర్‌ను బార్‌ అండ్‌ రెస్టారెంట్‌ కోసం కేటాయించటం సిగ్గుచేటన్నారు. ఈ ఏర్పాటు సరికాదని, దీనిని తొలగిస్తామన్నారు. అనంతరం వరంగల్‌ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. టీపీసీసీ రాష్ట్ర అధికారప్రతినిధి మహ్మద్‌రియాజ్‌, తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక అధ్యక్షుడు సూరి, జనరల్‌ సెక్రటరీ కుమార్‌, తెలంగాణ ఉద్యమకారులు వేదిక చైర్మన్‌ కూరపాటి వెంకటనారాయణ, ఉద్యమకారులు ఆకాంక్షల వేదిక బాధ్యులు సూరయ్య, రమాదేవి, గాదె ఇన్నయ్య, జైసింగ్‌రాథోడ్‌, పృథ్వీరాజ్‌, దేవేందర్‌, శోభారాణి, అనిల్‌ సిద్ధిఖీ, టి శోభారాణి, జి రాజు, తదితరులు పాల్గొన్నారు. దారదేవేందర్‌, బుల్లెట్‌వెంకన్న కళాకారుల బృందాలు పాటలు పాడారు. కాగా తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక పలు డిమాండ్లతోకూడిన వినతిపత్రాన్ని మంత్రి సీతక్కకు అందజేశారు.

గంజాయి పీల్చేందుకే ..

అద్దె ఇంట్లో మొక్కల పెంపకం

- నిందితుడికి రిమాండ్‌
- వివరాలు వెల్లడించిన సీఐ మల్లయ్య



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మల్లయ్య

ఖిలా వరంగల్‌: అద్దె ఇంట్లో గంజాయి సాగు చేస్తూ పట్టుబడిన ఘటనలో వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్‌ మల్లయ్య తెలిపారు. ఈమేరకు ఆదివారం మిల్స్‌కాలనీ పోలీస్‌ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్సైలు వెంకన్న, గోవర్ధన్‌తో కలిసి కేసు వివరాలు వెల్లడించారు. ఉర్సు కరీమాబాద్‌ దర్గా సమీపంలో ఎండీ జమీర్‌ తాను అద్దెకుంటున్న ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలు పెంపకం చేపడుతుండడంతోపాటు ఎండు గంజాయి కలిగి ఉన్నాడని ఎస్సై జి. వెంకన్నకు శనివారం సాయంత్రం సమాచారం అందింది. దీంతో వెంటనే ఎస్సై వెంకన్న సిబ్బందితో కలిసి జమీర్‌ ఇంటిని తనిఖీ చేశారు. ఇందులో కేజీన్నర ఎండు గంజాయి లభ్యం కాగా స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత ఇంటి పెరట్లో పెంచిన ఐదు గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. నిత్యం గంజాయి పీల్చేందుకే పెరట్లో మొక్కలు పెంచానని విచారణలో ఒప్పుకోవడంతో ఎండి. జమీర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ మల్లయ్య తెలిపారు.

సర్కస్‌ చేసేందుకు వచ్చి.. శవమై

- ఎస్సారెస్పీ కాల్వలో కొట్టుకువచ్చిన బాలిక మృతదేహం



సంజన మృతదేహం

కేసముద్రం /పర్వతగిరి : ఎస్సారెస్పీ కాల్వ లో ఓ బాలిక మృతదేహం కొట్టుకువచ్చిన సంఘటన మహబూబాబాద్‌ జిల్లా కేసముద్రం మండలం తావుర్యా తండా గ్రామశివారు మూలస్తంభం తండా వద్ద ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. కేసముద్రం ఏఎస్సై కృష్ణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సమాని రవి, సంధ్య దంపతులు తమ కుమార్తె సంజన(7)తో పాటు, బంధువులతో కలిసి పొట్టకూటి కోసం సర్కస్‌ చేసేందుకు పర్వతగిరి మండలం ఇస్లావత్‌తండా గ్రామానికి వచ్చారు. ఈ క్రమంలో సాయంత్రం నుంచి బాలిక కనిపించకపోవడంతో స్థానికులు, కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా బాలిక మృతదేహం కేసముద్రం మండలం తావుర్యాతండా జీపీ సమీపంలోని ఎస్సారెస్పీ కాల్వలో వస్తుండగా, గమనించిన స్థానికులు మృతదేహన్ని బయటకు తీశారు. ఇంతలో సమాచారం అందుకున్న పర్వతగిరి ఎస్సై వీరభద్రరావు, కేసముద్రం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కాల్వలో పడి మృతిచెందిన బాలిక సంజనగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని వరంగల్‌ ఎంజీఎంకు తరలించారు. కాగా బాలిక ఎస్సారెస్పీ కాల్వలో ఎలా పడిందనే విషయంపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు బాలికను కిడ్నాప్‌ చేశారని ప్రాథమిక సమాచారం.

రైలునుంచి పడి సీఆర్పీఎఫ్‌ జవాన్‌ మృతి



శ్రావణ్‌కుమార్‌ (ఫైల్‌)

కమలాపూర్‌ : హనుమకొండ జిల్లా కమలాపూర్‌ మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన సీఆర్పీఎఫ్‌ జవాన్‌ తెప్ప శ్రావణ్‌కుమార్‌ (35) శనివారం రాత్రి ప్రమాదవశాత్తు రైలు నుంచి జారీపడి మృతిచెందాడు. బంధువులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రావణ్‌కుమార్‌ మణిపూర్‌ సీఆర్పీఎఫ్‌ జీడీ–143 బెటాలియన్‌లో జవాన్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల సెలవుపై ఇంటికి వచ్చిన శ్రావణ్‌కుమార్‌ తిరిగి డ్యూటీలో చేరేందుకు మణిపూర్‌ వెళ్తున్నాడు. ఈ క్రమంలోనే హసన్‌పర్తి మండలం కోమటిపల్లి గేట్‌ వద్ద ప్రమాదవశాత్తు రైల్లోంచి జారీ పడి మృతి చెందాడు. శ్రావణ్‌కుమార్‌ అంత్యక్రియలు ఆయన స్వగ్రామం గూడూరులో ఆదివారం సాయంత్రం సీఆర్పీఎఫ్‌ లాంఛనాలతో నిర్వహించారు. పలువురు సీఆర్పీఎఫ్‌ అధికారులు ఆయన పార్థివదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. శ్రావణ్‌కుమార్‌ మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. శ్రావణ్‌కుమార్‌ మృతితో గూడూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

జనగామలో గుర్తుతెలియని వ్యక్తి..



జనగామ : జనగామలోని బాణాపురం అయ్యప్పస్వామి ఆలయ సమీపంలో గుర్తు తెలియని (సుమారు 60ఏళ్ల వయసు) వ్యక్తి ఆదివారం ఉదయం రైలు నుంచి కిందపడి మృతి చెందినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని, మృతదేహన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి పోస్టుమార్టం గదిలో భద్రపరిచినట్లు తెలిపారు. వివరాలు తెలిసిన వారు జనగామ జీఆర్పీ సిబ్బంది 87126 58603 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

బీజేపీ నేషనల్‌ కన్వెన్షన్‌లో ఉమ్మడి జిల్లా నేతలు



సమావేశంలో పాల్గొన్న రావు పద్మ, రవికుమార్‌, దశమంతరెడ్డి, మురళీధర్‌ గౌడ్‌

హన్మకొండ: ఢిల్లీలోని భరత మండపంలో జరుగుతున్న బీజేపీ నేషనల్‌ కన్వెన్షన్‌ రెండో రోజు ఆదివారం ఉమ్మడి వరంగల్‌ జిల్లా బీజేపీ నాయకులు పాల్గొన్నారు. హనుమకొండ, వరంగల్‌, జనగామ, జయశంకర్‌ భూపాలపల్లి జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, గంట రవికుమార్‌, ఆరుట్ల దశమంతరెడ్డి, ఏడునూతల నిషిధర్‌ రెడ్డి, వరంగల్‌ లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ వి.మురళీధర్‌గౌడ్‌, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్‌, వరంగల్‌ పార్లమెంట్‌ నియోజకవర్గ కన్వీనర్‌ తాళ్లపల్లి కుమారస్వామి, నాయకులు దేశిని సదానందం, కందగట్ల సత్యనారాయణతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ పలువురు జాతీయ నాయకులను కలిశారు.

హైనా దాడిలో దూడ మృతి

తరిగొప్పుల : హైనా దాడి చేయగా ఓ దూడ మృతి చెందింది. మండలంలోని అక్కరాజుపల్లికి చెందిన మంచినీళ్ల ప్రభాకర్‌ పశువుల పాకపై శని వారం రాత్రి హైనా దాడి చేసి అక్కడ ఉన్న దూడను చంపింది. కాగా, ఇటీవల గుర్తుతెలియని జంతువు దూడలను చంపుతుండడంతో మండల రైతులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి జంతువును బంధించాలని కోరుతున్నారు.